క్లుప్తంగా

రామలింగేశ్వరపేటలో రోడ్డు మిగులు పనులు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో 32వ డివిజన్ రామలింగేశ్వరపేట రోడ్డు ఫేవర్ వర్క్ పనులను బుధవారం కార్పొరేటర్ చెన్నగిరి రామ్మోహనరావు ప్రారంభించారు. ఎన్నికలకు ముందు ఇక్కడ రోడ్డు పనులు పూర్తిచేశారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో రోడ్డు ఫేవర్ వర్క్ పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు ఆ మిగులు పనులు ప్రారంభించారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా రామ్మోహనరావు తెలిపారు.

ఏడీసీపీ కృష్ణమూర్తినాయుడుకు ఉద్యోగోన్నతి



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో క్రైం ఏడీసీపీ, ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.కృష్ణమూర్తినాయుడుకు ఉద్యోగోన్నతి లభించింది. నాన్ కేడర్ ఏఎస్పీ హోదాలో ఉన్న ఆయనకు ప్రభుత్వం నాన్ కేడర్ ఎస్పీ హోదాను కల్పిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగోన్నతి పొందిన వెంటనే జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబును ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వీట్లు అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో సంగీత విభావరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన నాదెండ్ల ఫణికుమారి బృందంచే ఆలపించిన సంగీత విభావరి అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై ఫణికుమారి బృందం పలు కీర్తనలకు మధురంగా ఆలపించారు. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో పారాయణం



మధురానగర్(విజయవాడ సెంట్రల్): దుర్గాపురం శ్రీ అయ్యప్పస్వామి మందిరంలో శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. గురుస్వామి బల్లెం పూర్ణయ్య స్వామి స్వామివారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. సాయంత్రం భక్తబృందం ఆధ్వర్యంలో పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బందికి హెచ్‌హెచ్‌టీఎస్ పంపిణీ పూర్తి

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ):రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బందికి హ్యాండ్ హెల్డ్ టెర్మినల్ (హెచ్‌హెచ్‌టీఎస్)లను పంపిణీ వంద శాతం పూర్తయిందని విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ అధికారి ఎన్.మండురూప్‌కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని టికెట్ చెకింగ్ సిబ్బందికి, స్టేషన్‌లలోని స్క్వాడ్ సిబ్బందికి 988 హెచ్‌హెచ్‌టీఎస్‌లను అందజేశామని పేర్కొన్నారు. దీంతో డివిజన్‌లో నగదు రహిత, పారదర్శకత అందుబాటులోకి వస్తుందన్నారు.

ఇరిగేషన్ స్థలాల్లో యథేచ్ఛగా ఆక్రమణలు

- ఏకంగా బుడమేరు మధ్యలో గట్టు నిర్మాణం
- అయోధ్యనగర్‌లో ఇష్టారాజ్యంగా రేకుల షెడ్ల నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- పేట్రేగిపోతున్న ఆక్రమణదారులు



బుడమేరు మధ్యలో బుడమేరు నీరు రాకుండా వేసిన గట్టు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే అయోధ్యనగర్ అన్న క్యాంటీన్ సమీపంలోని ఇరిగేషన్ స్థలాల్లో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. అన్ని అనుమతులతో ఇంటి నిర్మాణం చేసుకుంటుంటేనే కాసుల కోసం వాలిపోయే అధికారులు ఇక్కడ మాత్రం నడిరోడ్డు పక్కన అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నా కళ్లుండీ చూడలేని గుడ్డివాళ్లలా పట్టించుకోకపోవటం గమనార్హం. ఇప్పటికే బుడమేరులో చాలా వరకు ఆక్రమణలకు గురైంది. ఇప్పుడు ఆక్రమణల వల్ల బుడమేరు కాస్తా బుడ్డి ఏరు మాదిరిగా మారిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బుడమేరు మధ్యలో గట్టు వేసి బుడమేరు నీరు రాకుండా చేసి ఆక్రమణలు చేసేందుకు కొందరు కబ్జాదారులు సమాయత్తం అవుతున్నారు. ఇక్కడ దుకాణాలు నిర్మించటం వల్ల ఇప్పటికే ట్రాఫిక్ అధికంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణాల వల్ల ట్రాఫిక్‌తో పాటు ప్రమాదాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. అధికారులు ఈ విషయంలో వెంటనే స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





అయోధ్యనగర్ అన్న క్యాంటీన్ సమీపంలోని ఇరిగేషన్ స్థలంలో ఆక్రమణలు

రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరగడం లేదు

బీఆర్ అంబేద్కర్ మిషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బళ్లారపు జగదీష్



సమావేశంలో మాట్లాడుతున్న బి.జగదీష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అన్ని రంగాల్లో రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరగడం లేదని బీఆర్ అంబేద్కర్ మిషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బళ్లారపు జగదీష్ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కింది స్థాయిలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారే తప్ప ఉన్నత స్థాయి ఉద్యోగాల నియామకంలో రిజర్వేషన్ అమలు కావడం లేదన్నారు. ప్రశ్నించే తత్వం లేనంత కాలం ఇలాగే జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న వారు చాలా మంది ఉన్నారని వారికి సరైన అవకాశాలు లేవన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల్లో హామీ ఇస్తున్నారే గానీ వాటిని అమలు చేయడం లేదన్నారు. ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకోవడానికి, ఆర్థికంగా సహాయం అందించేందుకు కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. తమ సంస్థ ఆశయాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్తామన్నారు. దళితులపై జరిగే దౌర్జన్యాలను చట్టపరంగా అడ్డుకుంటామన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసి ప్రభుత్వ పథకాలు, వారి హక్కులను కాపాడుకునేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు జి.కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం మైనం హుస్సేన్

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు అన్ని రంగాలలో విజయాలు సాధిస్తూ పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్‌లో బుధవారం టాటా ఇండియా బిల్డింగ్ ఫర్ ద నేషనల్ కాన్సెప్ట్, భారత దేశం సాధించిన విజయాలు, భారతదేశం అభివృద్ధి-విద్యార్థుల, యువత ప్రాతినిధ్యం అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించగా మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు టాటా సంస్థ లోగో వున్న బంగారు, వెండి, కాంస్య పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. పదవ తరగతి విద్యార్థులు కె.సాయి అక్షయ, ఎ.అనిల్‌కుమార్, ఎం.లోకేష్ మొదటి మూడు స్థానాలు సాధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునందు, రాధిక, రేణుకాదేవి, టాటా సంస్థ ప్రతినిధి అన్వేష్ పాల్గొన్నారు.

జై సంతోషిమాత అమ్మవారి ఉత్సవాలు ముగింపు



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలో ఉన్న జై సంతోషిమాత అమ్మవారి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈనెల 19వ తేదీ రాఖీ పౌర్ణమి నాడు అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్విఘ్నంగా జరిగాయి. ఉత్సవాలలో చివరి రోజున మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 5వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో ఈ ఏడాది జయంతి ఉత్సవాలు విజయవంతంగా పూర్తిచేశామన్నారు. ప్రత్యేకించి ఈ ఏడాది అమ్మవారి ఆలయ ధ్వజస్తంభ, కలశ ప్రతిష్టాపన, జయంతి ఉత్సవాలు ఒకే నెలలో అమ్మవారి దయతో విజయవంతంగా జరిగినట్లు చెప్పారు. జయంతి ఉత్సవాలకు ఉమ్మడి కృష్ణాజిల్లా పరిసర ప్రాంతాల నుంచే కాకుండా గుంటూరు, ఉత్తరాంధ్ర జిల్లాలు, ఉభయగోదావరి జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీమంత్రి నాగేశ్వరరావు, ఎస్.మార్కండేయులు, జొన్న నాని, చిన్ని లక్ష్మి, నవులూరి శ్రీనివాసరావు, చీపురుపల్లి నాగ తులసి, ఎస్. శ్రీనివాసరాజు, పి.పెద్దిరాజు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో సభ్యత్వం

ఏపీ ఎన్జీవో నేత విద్యాసాగర్



సభ్యత్వ పత్రాలు అందజేస్తున్న ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైద్య ఆరోగ్య శాఖలో మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తూ రెగ్యులర్ అయిన ఉద్యోగులు ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌లో సభ్యులుగా చేరారు. ఏపీ ఎన్జీవో కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ సభ్యత్వ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఉద్యోగులు సంఘంలో చేరడం అభినందనీయమని అన్నారు. దాదాపు 70 సంవత్సరాలకు పైబడి సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తోందన్నారు. నాల్గవ తరగతి ఉద్యోగులు మొదలుకుని ఉన్నతాధికారి వరకు నేడు ప్రభుత్వం నుంచి పొందుతున్న ప్రతి లబ్ధి వెనుక ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకుల కృషి ఉందన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని దశాబ్దాల కాలంగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రభుత్వంపై తీసుకువచ్చిన ఒత్తిడి కారణంగా దశల వారీగా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా నేతలు డి. సత్యన్నారాయణ రెడ్డి, బి.సతీష్ కుమార్, బీవీ రమణ, ఎం.రాజుబాబు, ఎం.నాగార్జున రావు, జి.రామకృష్ణ, డి.విశ్వనాథ్, సీహెచ్ దిలీప్ కుమార్, కె.శివలీల, నగర శాఖ కార్యవర్గ సభ్యులు, మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులతో పాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



23వ డివిజన్‌లో ప్రతిపాదిత రోడ్డును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): రోడ్ సేఫ్టీ చర్యల్లో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇంజినీరింగ్ శాఖ తీసుకుంటున్న భద్రతా చర్యలపై రూపొందించిన నివేదికలను బుధవారం ఆయన స్వయంగా పరిశీలించారు. వేముల శ్యామల దేవి రోడ్డు, విశాలాంధ్ర రోడ్డు, ఏఎస్ రామారావు రోడ్డు, సింగనగర్ శాంతినగర్, ఎక్సెల్ ప్లాంట్, వాంబే కాలనీ, పైపులు రోడ్డు ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. 23వ డివిజన్లోని దాసరి వారి వీధిలో కొత్త రోడ్డు ప్రతిపాదనపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పాత రాజీవ్ నగర్ లోని పాత కమ్యూనిటీ హాల్ పరిశీలించగా కమ్యూనిటీ హాల్ పడగొట్టేందుకు ఇంజినీరింగ్ శాఖ ప్రతిపాదనపై సంబంధిత భవనానికి స్టెబిలిటీ ఉందా లేదా అని చూడాలని ఆదేశాలిచ్చారు. ప్రహరీ డిమాలిష్ చేసిన తర్వాత పరిసరాలు మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని, ఇక్కడ పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం ఆయన ఐకానిక్ పార్క్ ను సందర్శించి పూర్తి స్థాయి వివరాలతో నివేదికను ఇవ్వాలని కోరారు. పర్యటనలో సర్కిల్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి. శ్రీనివాస్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

26న కూచిపూడి నృత్య నీరాజనం

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 26 వ తేదీ సాయంత్రం కూచిపూడి నృత్యోత్సవం నిర్వహిస్తునట్లు సంగీత సభ ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూచిపూడి నాట్యాచార్యుడు డాక్టర్ చింతా రవిబాలకృష్ణ బృందం పలు నృత్యాంశాలను ప్రదర్శిస్తుందని పేర్కొన్నారు.

మహిళలపై దాడులకు రైల్వే ఉద్యోగుల నిరసన



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ):దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజనల్ సెక్రటరీ ఎం.లీల డిమాండ్ చేశారు. కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేఎస్ఎస్ మూర్తిభవన్ నుంచి రైల్వేస్టేషన్ వరకు నిర్వహించిన ఈ ప్రదర్శనలో ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. డాక్టర్ హత్యాచార ఘటనలో నిందితులందరికీ వెంటనే కఠిన శిక్షలు విధించాలని కోరారు. యూనియన్ డివిజనల్ మహిళా కో ఆర్డినేటర్ హారిక, కోశాధికారి లక్ష్మి, అధ్యక్షుడు రామగుప్తా, పెద్ద సంఖ్యలో మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలకు సిద్ధం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీఎంసీ అనుమతులు లేకుండా అనధికారికంగా లేఅవుట్లు వేశారని, వాటిపై చర్యలకు ఉపక్రమించామని కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుందావారి కండ్రికలో పొన్నం మనీషా లేఅవుట్ సర్వే నం 58/1బి, 58/4బిలో ఉన్న 3.6 ఎకరాలు, ఇదే ప్రాంతంలో ఉన్న కలకోటి సీతారావమ్మ సర్వే నం 38/1ఏలో 3.45 ఎకరాల్లో అనధికారిక లేఅవుట్ వేశారని తెలిపారు. విద్యాధరపురంలోని 91/పి సర్వే నంబర్‌లోని 1.21 ఎకరాలు, గుణదలలోని మమ్మినేని దినేష్ పేరుతో సర్వే నం 194లో ఉన్న 1.48, 165లో ఉన్న 1.32, 166లో ఉన్న 0.84, 180/3లో ఉన్న 3.10 అనధికారిక లే అవుట్‌ను గుర్తించామని చెప్పారు. గుణదలలో కడియాల సుబ్రమణ్యం పేరుతో సర్వే నం 137/1లో ఉన్న 4.55, సర్వేనం 88లో 2.50 ఎకరాలు, సర్వే నంబరు 31లో ఉన్న గద్దె శ్రీనివాసరావు పేరుతో ఉన్న 4 ఎకరాలు, సర్వేనం 54/2బిలో సూర్యదేవర మురళి పేరుతో ఉన్న 1.35 ఎకరాల్లో అనధికారి లేఅవుట్లను గుర్తించామని ఆయన ఆ ప్రకటనలో సవివరంగా పేర్కొన్నారు.

కీచకులపై కఠిన చర్యలు చేపట్టాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి ధూళిపాళ్ల రమాదేవి
- నేతాజీ స్కూల్ విద్యార్థులతో ఐద్వా నిరసన ర్యాలీ



నేతాజీ స్కూల్ విద్యార్థులతో నిరసన ర్యాలీ చేస్తున్న ఐద్వా నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసే దిశగా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి ధూళిపాళ్ల రమాదేవి అన్నారు. ఇటీవల కలకత్తా వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనకు నిరసనగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పశ్చిమ సిటీ కమిటీ ఆధ్వర్యంలో భవానీపురం నేతాజీ స్కూల్ విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నేతాజీ స్కూల్ నుంచి ప్రారంభమై క్రాంబే రోడ్డు, ఆర్టీసీ వర్కుషాపు రోడ్డు మీదుగా తిరిగి స్కూల్ వరకు సాగింది. వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని మహిళలు, విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను సమాజంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మహిళలు, విద్యార్థినులపై ఎటువంటి నేరాలు జరగకుండా పటిష్టమైన వ్యవస్థను రూపొందించాలని కోరారు. కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన సంఘటన అత్యంత దుర్మార్గమన్నారు. గతంలో జరిగిన సంఘటనలపై సరైన చర్యలు లేకపోవటంతో ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం నియంత్రణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఐద్వా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాలని, అత్యాచారాలు, హత్యలు జరిగినపుడు దోషులను కఠినంగా శిక్షించేలా చట్టాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు కుండనాల శేషమణి, గాదె ఆదిలక్ష్మి, కె.వెంకటరత్నం, నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ కె.తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ కె.అరుణ, కె.శిరీష, కె.లావణ్య, గాయత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన



బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టిన బ్యాంకు ఉద్యోగులు

బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో నిర్వహణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ బుధవారం రాత్రి బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన జరిగింది. గవర్నర్‌పేటలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా ఈ ప్రదర్శన నిర్వహించారు. వివిధ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ప్రదర్శనలో పాల్గొన్నారు. మహిళలకు పని ప్రదేశంలో భద్రత కల్పించాలని, మహిళల రక్షణకు మరింత పటిష్టమైన చట్టాలు ఉండాలని, కలకత్తా ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య డెప్యూటీ ప్రధాన కార్యదర్శి, సహకార బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్ మాట్లాడుతూ కోల్‌కతా వైద్య కళాశాల ఆసుపత్రిలో జరిగిన హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సీబీఐ నిష్పాక్షికంగా దర్యాప్తు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి ఈ శిక్షలు హెచ్చరికగా ఉండాలని కోరారు. ఆందోళన చేస్తున్న వైద్యులకు న్యాయం జరిగే వరకూ బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి అండగా ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, కె.రాధాకృష్ణ, కార్యదర్శులు యూవీఎస్ఎస్ హరివర్మ, బొమ్మదేవర ఉదయవర్లు, కృష్ణాజిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి మహిళా నాయకులు వోల్గాదేవి, సుధా మాధురి, బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సుబ్బారావు, రమేష్ బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు తమ సమస్యలను వివరిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

పటమట(విజయవాడతూర్పు): మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ సర్వీస్ అసోసియేషన్ నాయకులు బుధవారం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రకు వినతిపత్రం అందించారు. ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్ వద్ద అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ తిమ్మసర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కలిసిన ఉద్యోగులు వారి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఉద్యోగుల ప్రమోషన్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు, డ్రైవర్లు, క్లీనర్లు, పారిశుద్ధ్య కార్మికులకు, ఆఫీస్ సబార్డినేట్లకు యూనిఫారాలు మంజూరు చేయుట, పీఎఫ్ లోన్లు, డీఏ, పీఆర్‌సీ బకాయిలు, త్వరితగతిన చెల్లించాలని, 2024 జనరల్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉద్యోగులకు రెమ్యూనరేషన్స్ చెల్లింపు వంటి విషయాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ సలీం అహ్మద్, అసోసియేట్ ప్రెసిడెంట్ గుర్రం ప్రకాష్ సాగర్, వైస్ ప్రెసిడెంట్ ఓ.శారద రాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓ.సురేంద్ర కుమార్, సెక్రటరీలు శర్మ, సుభాకర రావు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.